క్లుప్తంగా

వైభవంగా అద్దంకి నాంచారమ్మ తల్లి తిరునాళ్ల



నందనవనంలో కుంకమ బండ్ల ఉత్సాహం చేస్తున్న గ్రామస్తులు

హనుమంతునిపాడు: మండల పరిధిలోని నందనవనంలో గురువారం అద్దంకి నాంచారమ్మ తల్లి తిరునాళ్ల వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కుంకమ బండ్లను ఏర్పాటు చేశారు. గ్రామోత్సవం నిర్వహించుకుంటూ అమ్మవారి గుడి వద్ద కుంకుమ బండ్ల ప్రదక్షిణ నిర్వహించారు. ప్రత్యేక పొంగళ్లు పొంగించి అమ్మవారికి సమర్పించారు. మహిళలు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారికి వైఎస్సార్ సీపీ నాయకుడు సూరిశెట్టి నారాయణస్వామి ప్రత్యేకంగా కుంకుమ బండి ఏర్పాటు చేసి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు



చిత్ర లేఖన పోటీల్లో విద్యార్థులు

ఉలవపాడు: స్థానిక శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు గురువారం చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా ఉలవపాడు గ్రంథాలయంలో ఈ పోటీలు నిర్వహించారు. మొత్తం 42 మంది విద్యార్థులు ఈ పోటీలకు హాజరయ్యారు. ముందుగా నీతి కథలు, జాతీయ నాయకుల జీవిత చరిత్ర చదివించారు. గ్రంథపాలకుడు దాసరికోటేశ్వర రావు పాల్గొన్నారు.

559 పొగాకు బేళ్లు కొనుగోలు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గురువారం 559 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. పంగులూరివారిపాలెం, కమ్మవారిపాలెం గ్రామాల రైతులు 679 పొగాకు బేళ్లను వేలానికి తీసుకురాగా 120 బేళ్లను వ్యాపారులు తిరస్కరించారు. గరిష్ట ధర కేజీ రూ.322, కనిష్ట ధర రూ.205, సరాసరి ధర రూ.256.63 పలికింది. వేలంలో మొత్తం 40 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

దివ్యాంగుడికి కుట్టు మిషన్ బహూకరణ




బుజ్జిబాబుకు టైలరింగ్ వస్తువులు అందజేస్తున్న దాతలు

పొన్నలూరు: స్థానిక బాప్టిస్టు నగర్‌కు చెందిన దివ్యాంగుడు చుండి బుజ్జిబాబుకు వైఎస్సార్ సీపీ నాయకులు గడ్డం వేణుబాబు, భూమిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి రూ.23 వేలు విలువ చేసే కుట్టు మిషన్‌ను గురువారం బహూకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన బుజ్జిబాబుకు టైలరింగ్ వస్తువులు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో చుండి జేమ్స్, చుండి నాగేశ్వరరావు, గొడపేరు రవి, గొడపేరు విజయ్, జడ భరత్ పాల్గొన్నారు.

జూన్ 1న 9,272 మందికి పింఛను

సింగరాయకొండ: మండలంలో 9,272 మందికి పింఛను పంపిణీ చేయాల్సి ఉండగా జూన్ ఒకటో తేదీన 7,090 మందికి డీబీటీ పద్ధతి ద్వారా బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయనున్నట్లు ఎంపీడీఓ నాగేష్‌కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. మిగిలిన 2,182 మందికి ఇంటి వద్ద పింఛను అందించనున్నట్లు చెప్పారు. లబ్ధిదారుల జాబితాను ఆయా గ్రామ సచివాలయాల వద్ద ప్రకటించనున్నట్లు తెలిపారు. పింఛనుదారులు ఆందోళన చెందకుండా, పంపిణీకి సహకరించాలని కోరారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం



గుడ్లూరులో పాల్గొన్న నాయకులు

గుడ్లూరు: సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని ఎర్రప్రగడ ఆటో వర్కర్స్ స్టాండ్ వద్ద గురువారం ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ జెండాను భవననిర్మాణ కార్మిక సంఘం నాయకులు వల్లెపు కొండయ్య ఆవిష్కరించారు. యూనియన్ జిల్లా కార్యదర్శి జి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్మికుల హక్కుల కోసం ఎన్నో పోరాటాలు జరిగాయన్నారు. జాలయ్య, వెంకటేశ్వర్లు, క్రిష్ణయ్య, వెంకయ్య పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో సీబీఎస్ఈ సిలబస్

- నియోజకవర్గంలో తొలి విడతగా 10 పాఠశాలలు ఎంపిక
- ఈ ఏడాది నుంచి సీబీఎస్ఈ బోర్డు ద్వారా పది పరీక్షలు
- జాతీయస్థాయి పోటీ పరీక్షల్లో రాణించే అవకాశం



మోడల్ స్కూల్ కనిగిరి

కనిగిరి రూరల్: ప్రభుత్వం సర్కారు బడుల్లో సీబీఎస్ఈ పాఠాలు బోధనలకు శ్రీకారం చుట్టింది. చదువుతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, వారి కుటుంబాలు ఆర్థికంగా బలోపేతమవుతాయనే ఉన్నత లక్ష్యం, ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యా రంగానికి పెద్ద పీట వేసింది. అందులో భాగంగానే ప్రభుత్వ బడుల్లో నూతన సంస్కరణలకు నాంది పలికారు. నాడు- నేడు కింద పాఠశాలల్లో అనేక మౌలిక వసతులను కల్పించింది. డిజిటల్ విద్యను అందుబాటులోకి తెచ్చింది. తాజాగా సీబీఎస్ఈ సిలబస్‌ను ప్రభుత్వ బడుల్లో బోధించేందుకు చర్యలు చేపట్టింది. ఈ తరుణంలో ఆయా పాఠశాలల్లోని విద్యార్థులు 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన పదో తరగతి విద్యార్థులు సీబీఎస్ఈ బోర్డు ద్వార పదో తరగతి పరీక్షలు రాయనున్నారు.

తొలి విడతలో 10 పాఠశాలలు..

నియోజకవర్గంలో ఎంపిక చేసిన పాఠశాలల్లో సీబీఎస్ఈ బోధన అమలు చేయనున్నారు. పిల్లల చదువులో అభివృద్ధి సాధించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ విధానాన్ని అమలు చేసేందుకు నిర్ణయించింది. అందులో భాగంగా కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 10 పాఠశాలలను తొలివిడతగా ఎంపిక చేసింది. బడుల్లో బట్టీ విధానానికి, మూస పద్ధతికి స్వస్తి పలికి సెంట్రల్ బోర్డ్ సెకండరీ ఎడ్యుకేషనల్ సిలబస్ అమలు చేయనున్నారు. ఇందుకోసం ఇప్పటికే విద్యాశాఖ అధికారులు ఎంపిక చేసిన పాఠశాలల్లో ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు.

పేద విద్యార్థుకు ప్రోత్సాహం

ఇప్పటి వరకు కార్పొరేట్, ఇతర ప్రత్యేక పాఠశాలల్లోనే సీబీఎస్ఈ సిలబస్ అమలు అయ్యేది. ప్రస్తుతం నడుస్తున్న పోటీ ప్రపంచంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు విద్యార్థులు సిద్ధం కావాలంటే సీబీఎస్ఈ సిలబస్ కచ్చితంగా ఉండాలి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఇలాంటి బోధన అందించాలన్న సంకల్పంతో చర్యలు తీసుకుంది. అన్ని రకాల వనరులు ఉండి, పిల్లల సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలల్లోనే దీన్ని ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు చేస్తున్నారు. 8వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఈ బోధన ద్వార చదువుకునే అవకాశం ఉంటుంది. ఆయా విద్యాలయాల పర్యవేక్షణ కేంద్రంలోకి వెళ్తుంది. జేఈఈ, నీట్ లాంటి పోటీ పరీక్షలకు ఎంతగానే ఉపయోగం, విద్యార్థి అభ్యసన సామర్థ్యాలు పెంచేలా సిలబస్ ఉంటుంది. విద్యార్థుల ఆసక్తి, అభిరుచి గుర్తించి, వివిధ రంగాల్లో వారికి ప్రోత్సహిస్తారు. అవసరం మేరకు సబ్జెక్టు టీచర్లను నియమిస్తారు.

సీబీఎస్ఈ సిలబస్ ప్రయోజనాలు..

సీబీఎస్ఈ పుస్తకాలు, ఆసక్తిగా విద్యార్థులకు అర్థమయ్యేలా ఉంటాయి. కోర్సుల నిర్మాణం ఒత్తిడికి గురిచేయదు. విద్యార్థికి స్నేహ పూర్వకంగా ఉంటుంది. పోటీ పరీక్షల్లో విద్యార్థులకు విజయం సాధించేందుకు దోహదపడతాయి. యాంత్రిక విద్యకు దూరంగా ఉంటూ.. వాస్తవాలకు దగ్గరగా బోధిస్తారు. పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెద్దగా ప్రాధాన్యం కల్పించరు. సబ్జెక్టుల వారీగా ఏ మేరకు నేర్చుకున్నారనేది పరీక్షించేలా ప్రశ్నా పత్రాలు రూపొందిస్తారు. ఐఐటీ వంటి కేంద్రీకృత సంస్థ నుంచి భవిష్యత్ అధ్యయనాలు, కొనసాగించుకోవాలంటే సీబీఎస్ఈ పాఠ్యంశాలు సహాయపడతాయి. ఈ సంస్థల ప్రాథమిక పరీక్షలు సీబీఎస్ఈ ఆధ్వర్యంలో మాత్రమే నిర్వహిస్తారు.

సీబీఎస్ఈకి ఎంపికైన ప్రభుత్వ పాఠశాలలు ఇవే:

మండలం	సంఖ్య	పాఠశాలల పేర్లు
కనిగిరి	3	కేజీబీవీ, మోడల్ స్కూల్, జడ్పీ హెచ్ కంచర్ల వారిపల్లి
హెచ్ఎం పాడు	2	కేజీబీవీ, జడ్పీ హెచ్ ఎస్ సీతారం పురం
వెలిగండ్ల	1	కేజీబీవీ వెలిగండ్ల
సీఎస్‌పురం	2	కేజీబీవీ, జెడ్పీ హెచ్ఎస్ సీఎస్‌పురం,
పామూరు	1	కేజీబీవీ
పీసీపల్లి	1	కేజీబీవీ

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



ఈ ఏడాది నుంచి తొలి విడత ఎంపిక చేసిన ప్రభుత్వ బడుల్లోని సీబీఎస్ఈ సిలబస్ ద్వారా పాఠశాలు బోధిస్తాం. కార్పొరేట్ స్థాయిలో అభ్యాసాలు ఉంటాయి. ఇది విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు దోహదపడతుంది. జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో ఈ విద్య ఎంతగానో ఉపయోగ పడుతుంది. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సీబీఎస్ఈ సిలబస్ వరం. విద్యార్థులు ఈ బోధనను సద్వినియోగం చేసుకోవాలి. ఈ ఏడాది సీబీఎస్ఈ బోర్డు ద్వారా ఆయా పాఠశాలల్లోని విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాస్తారు.

– యు నారాయణరెడ్డి (ఎంఈఓ–2 కనిగిరి)

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



కట్టావారిపాలెంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ పాండురంగారావు



ఎస్టీకాలనీలో కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ రామానాయక్, ఎస్సైలు

పామూరు: మండల కేంద్రమైన పామూరు ఎస్టీకాలనీ, విరాట్‌నగర్‌లలో సీఐ ఎం రామానాయక్ ఆధ్వర్యంలో గురువారం సీఎస్‌పురం, పామూరు ఎస్సైలతో కలిసి కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్టీకాలనీ, విరాట్‌నగర్‌లలో అనుమానాస్పద గృహాలను తనిఖీ చేశారు. అనంతరం నిర్వహించిన కౌన్సెలింగ్‌లో సీఐ రామానాయక్ మాట్లాడుతూ జూన్ 4వ తేదీన ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా ఫలితాల్లో ఎవ్వరు, ఏపార్టీ గెలిచినా రెచ్చగొట్టే వ్యాఖ్యలుచేసినా, పోస్టింగులు పెట్టినా, గ్రామాల్లో పాత కక్షలు పెట్టుకుని అల్లర్లకు పాల్పడినా కఠిన చర్యలు చేపట్టడంతోపాటు రౌడీషీట్ నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఎన్నికల సంఘం నిబంధనలు, ప్రభుత్వం నిర్దేశిత నియమాలను ఉల్లంఘిస్తే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఎక్కడైనా అల్లర్లు సృష్టించేందుకు యత్నించినా అలాంటి సమాచారం ఉంటే పోలీసుల దృష్టికి తేవాలన్నారు. ఎన్నికల ఫలితాల రోజున బాణసంచా కాల్చడం, ర్యాలీలు చేపట్టడం నిషిద్ధమని, 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఎస్సైలు పామూరు ఎం సైదుబాబు, సీఎస్‌పురం ఎం ప్రేమ్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ధ్రువీకరణ పత్రాలు లేక సీజ్ చేసిన ద్విచక్రవాహనాలు

వివాదాలు సృష్టిస్తే కఠిన చర్యలు

కొండపి(సింగరాయకొండ): ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా గ్రామాల్లో గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కొండపి సీఐ వై.పాండురంగారావు హెచ్చరించారు. గురువారం ఉదయం మండలంలోని కట్టవారిపాలెం గ్రామంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని 18 వాహనాలను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ పాండురంగారావు మాట్లాడుతూ.. జూన్ 4న ఓట్ల లెక్కింపు నేపథ్యంలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసి అల్లర్లు, గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, రౌడీషీట్స్ నమోదు చేస్తామని హెచ్చరించారు. భవిష్యత్‌ను పాడుచేసుకోవద్దని యువతకు హితబోధ చేశారు. కొండపి ఎస్సై కృష్ణబాజీ బాబు, పొన్నలూరు ఎస్సై రాజేష్, మర్రిపూడి ఎస్సై శివబసవరాజు, సర్కిల్ పరిధిలోని పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అక్షరాలు కూడా నేర్పని ఉపాధ్యాయులెందుకు?



ఉపాధ్యాయుల సమస్యపై డిప్యూటీఈఓ ప్రసాద్‌ను ప్రశ్నిస్తున్న సభ్యులు



సమావేశంలో విద్యుత్‌శాఖ ఏఈ, వైస్ ఎంపీపీ మధ్య వాగ్వాదం

- సమావేశంలో సభ్యుల మండిపాటు

ఉలవపాడు: హైస్కూల్‌కు వచ్చినా విద్యార్థులకు కనీసం అక్షరాలు కూడా నేర్పడం లేదని, అలాంటి ఉపాధ్యాయులు ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్నారని ఇలాంటి వారెందుకని మండల సర్వసభ్య సమావేశంలో సర్వ సభ్యులు ధ్వజమెత్తారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం కార్పొరేట్ స్థాయిని మించి అన్ని సౌకర్యాలు కల్పిస్తుంటే ఉపాధ్యాయుల నిర్లక్ష్యం వలన విద్యార్థులు చదువులో వెనుకబడిపోతుండటం ఏంటని అడిగారు. ఉపాధ్యాయుల పనితీరు దారుణంగా ఉందన్నారు. ఎంఈఓలు, డీఈఓలు విద్యార్థుల సామర్థ్యం ఎందుకు తనిఖీ చేయడం లేదని ప్రశ్నించారు. విద్యుత్ శాఖ ఏఈ సమావేశాలకు సక్రమంగా రావడంలేదని వైస్ ఎంపీపీ సయ్యద్ ఫజుల్ ప్రశ్నించారు. విద్యుత్ రిపేర్లు ఉన్నాయని రావడం లేదని ఏఈ శ్రీనివాసరావు తెలుపగా.. మూడు నెలలకు ఒకసారి జరిగే సమావేశానికి కూడా రాకపోతే ఎలా అని ప్రశ్నించారు. దీనిపై ఇద్దరి మధ్య వాగ్వాదం వివాద స్థాయికి వెళ్లింది. తహసీల్దార్ చొరవ తీసుకుని సర్ది చెప్పారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో మైనర్ బాలురు పనికి వెళుతున్నారని, ఉలవపాడులో పని కేవలం కొందరి చేతుల్లో ఉందని, వారు చెప్పిన వారినే పనులకు తీసుకుని వెళుతున్నారని, అలా ఎందుకు జరుగుతుందని ప్రశ్నించారు. మామిడికి ఉలవపాడు ప్రఖ్యాతి అని, కానీ ఉద్యాన శాఖ నుంచి ఈ ఏడాది కనీసం ఒక్క రైతు ద్వారా అయినా మార్కెటింగ్, ఎగుమతులు చేయించారా అని ప్రశ్నించారు. కార్గో కోసం వస్తున్న బస్సుల్లో ప్రయాణికులు ఎక్కేలా స్టాపింగ్ ఇవ్వాలని కోరారు. ఉలవపాడులో జగనన్న లేఅవుట్‌కు సంబంధించి లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని, వారికి ప్రత్యామ్నాయ లేఅవుట్ కేటాయించాలని కోరారు. తనకు తెలియకుండా స్పందన అర్జీని కూడా మూసివేశారని వైస్ ఎంపీపీ సయ్యద్‌ఫజుల్ తెలిపారు. ఉలవపాడు వైద్యశాలలో కాల్ డ్యూటీ డాక్టర్లు ఎందుకు రావడంలేదు, కేసులు వచ్చినప్పుడు ఒంగోలు పంపించి రాకుండానే విధులకు గైర్హాజరవుతున్నారని ఇలా ఎందుకు జరుగుతుందని ప్రశ్నించారు. వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు పూర్తి స్థాయి అవగాహన ఎందుకు కల్పించడం లేదని ప్రశ్నించారు. సమస్యలను పరిష్కరిస్తామని అధికారులు సర్వ సభ్యులకు తెలియజేశారు. ఎంపీపీ మస్తానమ్మ, జెడ్పీటీసీ చేవూరి అరుణ, తహసీల్దార్ చంద్రారెడ్డి, ఎంపీడీఓ విజయకుమారి, వైస్ ఎంపీపీలు, ఫజుల్, రమణయ్య, మండల కోఆప్షన్ సభ్యులు ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

గుడ్లూరు: గ్రంథాలయ వేసవి శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా స్థానిక ఎర్రన గ్రంథాలయంలో విద్యార్థులకు గురువారం ఆటల పోటీలు నిర్వహించినట్లు గ్రంథపాలకుడు ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటలు ఆడటం వలన శారీక, మానసిక ఉల్లాసం కలుగుతుందని.. తద్వారా ఆరోగ్యంగా ఉంటారన్నారు. మ్యూజికల్ చైర్, పాటల పోటీలు నిర్వహించారు. ప్రతి రోజూ గ్రంథాలయానికి వచ్చి దిన పత్రికలు చదవడం వలన దేశంలో జరిగే సమాచారం తెలుసుకోవచ్చునన్నారు.

50 మందికి వైద్య పరీక్షలు

హనుమంతునిపాడు: మండల పరిధిలోని గాయంవారిపల్లిలో ఇంటింటికి ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరంలో భాగంగా గురువారం 50 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీ భార్గవి ఇంటింటికి తిరిగి దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వైభవంగా సుల్తాన్ బీబీ గంధోత్సవం



ప్రత్యేక అలంకరణలో సుల్తాన్ బీబీ సమాధి

గుడ్లూరు: మండలంలోని జాతీయ రహదారి పక్కనే తెట్టు గ్రామంలో ఉన్న శ్రీ సయ్యద్ సుల్తాన్ బీబీ 132 వ గంధ మహోత్సవ వేడుకలు గురువారం వైభవంగా జరిగాయి. దర్గాలో ఉన్న సుల్తాన్ బీబీ సమాధిని పట్టు వస్త్రాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. రాష్ట్రం నలుమూలలు నుంచే కాకుండా తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాలు నుంచి కూడా భక్తులు వేలాది మంది తరలి వచ్చి సుల్తాన్ బీబీ సమాధిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. దర్గా ముందు విద్యుత్ బల్బులతో ఏర్పాటు చేసిన తాజ్‌మహల్ నమూనా భక్తులను ఆకట్టుకుంది. కవ్వాలి, తెలుగు పాట కచేరీలు అలరించాయి. కందుకూరు డీఎస్పీ రామచంద్ర పర్యవేక్షణలో గుడ్లూరు సర్కిల్ సీఐ సుబ్బారావు ఆధ్వర్యంలో ఎస్సై లక్ష్మణరావు పలువురు ఎస్సైలు తమ సిబ్బందితో పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

రాష్ట్రంలో మళ్లీ జగనన్న పాలనే

కనిగిరి రూరల్: నవరత్నాలు, సంక్షేమ పథకాలతో ఐదేళ్లు అందించిన సువర్ణ పాలనను మళ్లీ రాష్ట్ర ప్రజలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగిస్తున్నారని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. గురువారం ఆయన స్థానిక కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో వినుత్న రీతిలో విప్లవాత్మక అభివృద్ధిని చేశారని తెలిపారు. డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ కనిగిరి ఎమ్మెల్యేగా, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఎంపీగా అత్యధిక మెజార్టీతో గెలుస్తున్నారని, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తున్నారని తెలిపారు.

నీటి ఎద్దడి ఉన్న వార్డుల్లో తక్షణ చర్యలు



వార్డుల్లో పర్యటిస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్, కౌన్సిలర్

కనిగిరి రూరల్: నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న వార్డుల్లో తక్షణ పరిష్కార చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని 13వ వార్డులోని అద్దంకి రంగబాబు వీధి, గునుపూటి వారి వీధిలలో గురువారం మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, కౌన్సిలర్ సయ్యద్ రిజ్వానా ఖాలక్‌కు పర్యటించారు. ఈ సందర్భంగా చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ ఎండ తీవ్రత పెరిగినందు వల్ల భూగర్భ జలాలు అడుగంటాయని, డీప్ బోర్లలోని మోటార్లు కాలుతున్నాయన్నారు. తత్ఫలితంగా వార్డుల్లో నీటి సమస్య తలెత్తుతున్నట్లు వివరించారు. తీవ్ర నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో తక్షణ చర్యగా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అన్ని వార్డుల్లో నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. వార్డులోని ప్రజలు పారిశుధ్యం, విద్యుత్ సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. తక్షణ చర్యలు చేపట్టాలని సచివాలయం సిబ్బందిని ఆదేశించారు. మాజీ వార్డు సభ్యులు సయ్యద్ నాయబ్ రసూల్, న్యాయవాది మోజేష్, స్థానికులు ఏ రంగబాబు, సాయిలక్ష్మీ, వెంకటేశ్వర్లు, ఎల్ఐసీ షబ్బీర్, సుబ్రహ్మణ్యం తదితరులున్నారు.

ఖాళీ స్థలాలు పరిశుభ్రంగా ఉంచకుంటే చర్యలు

కనిగిరి రూరల్: కనిగిరి మున్సిపాలిటీ పరిధిలో గృహ సముదాయాల మధ్యలో ఉన్న ఖాళీ స్థలాలను సంబంధిత యజమానులు శుభ్రం చేయించుకోకపోతే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని కమిషనర్ టీవీ రంగరావు అన్నారు. మున్సిపాలిటీలోని అన్ని సచివాలయాల అడ్మిన్‌లు, ప్లానింగ్ సెక్రటరీలతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ రంగారావు మాట్లాడుతూ అపరిశుభ్రంగా ఉన్న ప్రైవేట్ స్థలాలను గుర్తించి తక్షణం యజమానులకు నోటీసులు జారీ చేయాలన్నారు. స్పందించకుంటే ఆయా స్థలాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, నిబంధనల ప్రకారం జరిమానా విధించాలని ఆదేశించారు. ఖాళీ స్థలాల యజమానులు వారి వారి స్థలాలకు పన్నులు వేయించుకోవాలన్నారు. పట్టణ పరిధిలో నూతన నిర్మాణాలు చేపట్టే యజమానులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. పురపాలక సంఘ అభివృద్ధికి ప్రజలు సహకరించాలన్నారు. హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన వెంటనే ఆర్‌డబ్ల్యూఎస్ ట్యాంక్ సమీపంలోని తూర్పు వైపున ఉన్న ఖాళీ స్థల యజమాని తక్షణం జేసీబీతో స్థలాన్ని శుభ్రం చేయించినట్లు చెప్పారు. మేనేజర్ ప్రసాద్, టీడీపీ వివేకానంద కుమార్, ఆర్ఐ ప్రదీప్, సచివాలయ అడ్మిన్లు, సెక్రటరీలు పాల్గొన్నారు.

జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని పూజలు



పామూరు బాబా ఆలయంలో పూజలు చేస్తున్న అభిమానులు

పామూరు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని కోరుతూ గురువారం పామూరులోని సాయిబాబా ఆలయంలో వైఎస్సార్ సీపీ సోషల్‌మీడియా నియోజకవర్గ అధ్యక్షుడు మర్రి రాజు ఆధ్వర్యంలో అభిమానులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల పాలనలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతిగా ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. కనిగిరి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దద్దాల నారాయణయాదవ్, ఒంగోలు ఎంపీ అభ్యర్థి డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిలు భారీ మెజారిటీతో విజయం సాధించి మరోమారు వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టాలని వారు పూజలు చేశారు. కార్యక్రమంలో పార్టీ సోషల్‌మీడియా పామూరు మండల కన్వీనర్ షేక్.కరిముల్లా, సీఎస్‌పురం మండల కన్వీనర్ వెంకట గురవయ్య, కో కన్వీనర్లు మహేంద్ర, నాయబ, రామ సుబ్బయ్యయాదవ్, గోపి, పలువురు పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

60 ఏళ్లు పైబడిన వారందరికీ వాక్సినేషన్ వేయాలి

ఉలవపాడు: మండలంలో అడల్ట్ బీసీజీ టీకాలను వేయాలని రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ కామేశ్వర ప్రసాద్ తెలిపారు. కరేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో జరుగుతున్న వాక్సినేషన్ ప్రక్రియను గురువారం ఆయన పరిశీలించారు. వాక్సిన్‌పై వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారిని గుర్తించి వారికి 18 ఏళ్లు పైబడిన తరువాత టీకా ఇవ్వవచ్చని తెలిపారు. సిబ్బంది ఈ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 8 సచివాలయాల్లో జరుగుతున్న ఈ ప్రక్రియను ఆయన పరిశీలించారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ ప్రియంవద, వైద్యాధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఈ సెట్‌లో 7వ ర్యాంకు



షణ్ముఖ శర్మ

ఉలవపాడు: మండల కేంద్రమైన ఉలవపాడుకు చెందిన స్వయంపాకుల షణ్ముఖ శర్మ గురువారం విడుదల చేసిన ఇంజినీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్టు ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 7వ ర్యాంకు సాధించాడు. మొత్తం 145 మార్కులతో సత్తా చాటాడు. తండ్రి శర్మ పౌరోహిత్యం చేస్తుండగా తల్లి హేమ అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తోంది. షణ్ముఖ శర్మ 1 నుంచి 5 వరకు స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలలో చదివాడు. పదో తరగతి వరకు వీరేపల్లిలోని మోడల్ స్కూల్‌లో చదివాడు. పాలిటెక్నిక్ గుంటూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పూర్తి చేసిన అనంతరం ఈ సెట్‌లో 7 వ ర్యాంకు సాధించాడు.

సీఐటీయూ జెండా ఆవిష్కరణ



సీఐటీయూ జెండా ఆవిష్కరిస్తున్న రాము

టంగుటూరు: సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక శ్రీనివాస థియేటర్ సెంటర్లో జెండాను గురువారం సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.రాము ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1970 మే 30వ తేదీన సీఐటీయూ ఆవిర్భవించిందని తెలిపారు. అనతి కాలంలోనే ప్రపంచ వ్యాప్త గుర్తింపు పొందిన కార్మిక సంఘంగా సీఐటీయూ ఎదిగిందని తెలిపారు. అన్ని వర్గాల కార్మికులు, ఉద్యోగుల పక్షాన నికరంగా నిలబడి పోరాటాలు చేస్తున్న కార్మిక సంఘం సీఐటీయూ అని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వి.మోజేస్, కె.శ్రీనివాసులు, పేరాబత్తిన శ్రీను, తిరుమల, యానాది, పాపారావు, శ్రీను, సాయి తదితరులు పాల్గొన్నారు.